సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 30 । జూన్ । 2024



చీనీ ధర నేలచూపు
చీనీ ధరలు భారీగా పడిపోయాయి. శనివారం అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు మాత్రమే పలికాయి.



అలరించిన సంగీత కచేరీ
పర్తియాత్రలో భాగంగా ప్రశాంతి నిలయానికి విచ్చేసిన బాపట్ల జిల్లా భక్తులు సత్యసాయిని కీర్తిస్తూ కచేరీ నిర్వహించారు. చక్కటి పాటలతో అలరించారు. 8లో

గరిష్టం/కనిష్టం
35.3°/22.6°
జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఈవీఎంల భద్రత కట్టుదిట్టం



గోడౌన్ వద్ద పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

ధర్మవరం అర్బన్: ఈవీఎంల భద్రతను కట్టుదిట్టం చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. శనివారం ఆయన స్థానిక మార్కెట్‌యార్డులోని గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలను పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈవీఎంలను పరిశీలిస్తున్నామన్నారు. ఈవీఎంలను నిరంతరం పర్యవేక్షించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ రమేష్, సీఐ సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

మార్కెట్‌యార్డ్ కమిటీలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలక వర్గాలకు గడువు ముగియడంతో పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ ఆ శాఖ కమిషనరేట్ నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ)సి.రామాంజినేయులు, హిందూపురం మార్కెట్ యార్డ్ కమిటీకి ఆర్డీడీ శ్రీకాంత్‌రెడ్డి నియమితులు కాగా.. అనంతపురం జిల్లాలో ఉన్న మిగతా యార్డ్‌లకు ఏడీఎం సత్యనారాయణ చౌదరి, సత్యసాయి జిల్లాలో ఉన్న యార్డ్‌లకు ఏడీఎం ఎల్ఎస్ మూర్తి పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తారు.

గోళ్లాపురం పాఠశాలలో 'టీచకుడు'

- విద్యార్థినితో అసభ్య ప్రవర్తన, పోక్సో కేసు నమోదు



హిందూపురం అర్బన్: విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ ఉపాధ్యాయుడు ఆ వృత్తికే కళంకం తెచ్చాడు. బిడ్డలాంటి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా సదరు ఉపాధ్యాయుడిని కటకటాలకు పంపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... హిందూపురం మండలం గోళ్లాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.వలీసాబ్ 7వ తరగతి విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడు. లైగింకంగా వేధించాడు. ఈ ఘటన రెండు రోజుల క్రితం చోటుచేసుకోగా, బాలిక శనివారం తల్లిదండ్రులకు విషయం తెలిపింది. దీంతో వారు హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ వై.శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుడు వలీసాబ్ దురాగతం నిజమేనని తేలడంతో అతనిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

తప్పుకోవాల్సిందే!

- ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. కూటమి అధికారంలోకి వచ్చింది. 5వ తేదీ ఉదయం అనంతపురం రూరల్ మండలంలోని ఓ జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లిన టీడీపీ నేతలు 'ఇక్కడ పని చేస్తున్న నైట్ వాచ్‌మన్ రేపటి నుంచి రావాల్సిన పనిలేదు. ఆయన స్థానంలో మేము చెప్పిన వ్యక్తిని తీసుకోండి' అంటూ హెచ్ఎంను ఆదేశించారు. దీంతో చేసేదిలేక అప్పటిదాకా పని చేస్తున్న నైట్ వాచ్‌మన్‌ను ఆ మరుసటి రోజు విధుల నుంచి తప్పించారు.
- కళ్యాణదుర్గం మండల పరిధిలోని ఓ స్కూల్‌కు వెళ్లిన స్థానిక టీడీపీ నాయకులు అక్కడ పని చేస్తున్న అయా (మరుగుదొడ్లు శుభ్రం చేసే మహిళ)ను తప్పించాలని హెచ్ఎంకు చెప్పారు. ఆమె స్థానంలో మేము చెబుతున్న మహిళకు అవకాశం కల్పించండంటూ హుకుం జారీ చేశారు.
- శింగనమల నియోజకవర్గంలోని ఓ స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీని వదులుకోవాలని టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారు. కాదుగీదు అంటే అనవసరంగా ఇబ్బందులు పడతారని, ఈ నెలాఖరుకు ఖాళీ చేయాలని హెచ్చరించారు. అధికార పార్టీ నాయకులకు భయపడి గార్లదిన్నె మండలంలో రెండు స్కూళ్లల్లో పని చేస్తున్నవారు స్వచ్ఛందంగా తప్పుకున్నారు.



- ప్రభుత్వ స్కూళ్ల వాచ్‌మెన్లకు టీడీపీ హుకుం
- ప్రధానోపాధ్యాయుల ద్వారా ఒత్తిళ్లు
- మధ్యాహ్న భోజన ఏజెన్సీలపైనా కన్ను
- స్కూళ్లలో ఆయా పోస్టులనూ వదలని వైనం



అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో అధికారం మారింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ప్రభుత్వం తరపున ఏ చిన్న పోస్టులో అయినా సరే తమకు అనుకూలమైన వారే ఉండాలని అధికార కూటమిలోని టీడీపీ నేతలు 'ముద్ర' వేస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ స్కూళ్లల్లోని మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న ఏజెన్సీలు మొదలుకొని నైట్ వాచ్‌మెన్లు, చివరకు మరుగుదొడ్లు శుభ్రం చేసే ఆయా పోస్టులను కూడా వదలడం లేదు. వారంతా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నవారని, వారిని తప్పించి తమవాళ్లను నియమించాలంటూ ప్రధానోపాధ్యాయులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటికే ప్రతి నియోజకవర్గంలోనూ అధికార పార్టీ ఒత్తిళ్లు షురూ అయ్యాయి. ఎన్నో ఏళ్లుగా వాటినే నమ్ముకుని చిన్న జీతాలతో బతుకుతున్న తమ నోట్లో మట్టి కొడుతున్నారంటూ బాధితులు వాపోతున్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో కొందరు తప్పుకుంటుండగా, మరికొందరు స్వచ్ఛందంగా తప్పుకుంటున్నారు. నైట్ వాచ్‌మెన్, ఆయా పోస్టుకు నెలకు రూ.6 వేల వేతనం ఇస్తున్నారు. కొన్ని స్కూళ్లలో ఇప్పటికే మార్పు చేసి జాబితాలను సిద్ధం చేసి మండల విద్యాశాఖ అధికారులకు కూడా పంపినట్లు తెలిసింది. మరికొన్ని స్కూళ్లల్లో ఈ నెలాఖరు వరకు డెడ్‌లైన్ విధించారు. ఒకటో తేదీ నుంచి తమవాళ్లు వస్తారని హెచ్ఎంలకు తేల్చి చెప్పారు. పేరెంట్స్ కమిటీల తీర్మానంతో మార్పులు, చేర్పులు చేయొచ్చు. దీంతో చాలాచోట్ల ఉన్నవారిని తప్పించి కొత్తవారిని నియమించేందుకు పేరెంట్స్ కమిటీలతో తీర్మానాలు కూడా రాయించారు.

300 ఏజెన్సీల తొలగింపు

జిల్లాలో ఇప్పటికే 300 ఏజెన్సీలను మధ్యాహ్న భోజన పథకం అమలు బాధ్యతల నుంచి తప్పించారు. 2003లో మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) ప్రారంభమైనప్పటి నుంచి కొనసాగుతున్న ఏజెన్సీలను కూడా ప్రస్తుతం తప్పిస్తున్నారు. అప్పట్లో ఒక్క రూపాయి ఇవ్వకపోయినా నమ్ముకుని పని చేశారు. అలాంటి ఏజెన్సీలను తప్పించి అన్యాయం చేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు.

సమధర్మం పాటించకుండా బయటకు..

ప్రస్తుతం పని చేస్తున్న వారిలో నిజంగా పనితీరు సక్రమంగా లేకపోతేనో, ఇంకా ఏవైనా ఆరోపణలు ఉంటేనో అలాంటి వారిని తప్పిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. అంతేకానీ కేవలం తమ వారికి లబ్ధి చేకూర్చేందుకు మరొకరి పొట్ట కొట్టడం ఎంతవరకు సమంజసం అని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులైన వారిని నియమిస్తే ఈ ప్రభుత్వం సమధర్మం పాటించకుండా బలవంతంగా బయటకు నెట్టేస్తుండడం బాధాకరమని పలువురు పేర్కొంటున్నారు.

జిల్లాలో ఎండీఎం అమలవుతున్న మొత్తం స్కూళ్లు	1,694
స్వచ్ఛంద సంస్థలు నడుపుతున్న స్కూళ్లు	112
ఏజెన్సీలు నడుపుతున్న స్కూళ్లు	1,582
నాడు-నేడు స్కూళ్లలో పని చేస్తున్న వాచ్‌మెన్లు	274
పని చేస్తున్న ఆయాలు	887

పార్టీ ముద్రతో తప్పించడం సరికాదు



ప్రభుత్వ స్కూళ్లల్లో పని చేస్తున్న నైట్ వాచ్‌మెన్లు, ఆయాలను తప్పిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇది మంచి పద్ధతి కాదు. ఎవరైనా నిజంగా తప్పులు చేసి ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేసి చర్యలు తీసుకోవచ్చు. అంతేకానీ ఒక పార్టీ ముద్ర వేసి అనవసరంగా తప్పించాలని చూడడం సరికాదు. చిన్నచిన్న జీతాలతో బతుకుతున్న వారిని ఇలా ఉన్నఫళంగా తప్పిస్తే వారి జీవితాలు ఏమి కావాలి? ప్రభుత్వ పెద్దలు ఈ విషయంలో జోక్యం చేసుకోవాలి.

– విజయ్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకుడు

కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేదు



ఉన్నఫళంగా విధుల నుంచి తప్పించే విషయమై గతంలో కోర్టుకు వెళ్లిన సందర్భంలో కమిషనర్ ప్రత్యేక ఉత్తర్వులు ఇచ్చారు. 94 జీఓను పక్కాగా అమలు చేయాలంటూ డీఈఓ కార్యాలయం నుంచి అన్ని మండల కార్యాలయాలకూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ జీఓలను ఎవరూ లెక్క చేయడం లేదు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల నుంచి మమ్మల్ని ఎందుకు తప్పిస్తున్నారో రాతపూర్వకంగా ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదు. తప్పుకోకపోతే తంతామనే ధోరణిలో అధికార పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారు. వీరి ఆగడాలపై కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేదు.

–ఎం.నాగమణి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల అసోసియేషన్ అధ్యక్షురాలు

4,254 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 4,254 కేసులకు న్యాయమూర్తులు పరిష్కారం చూపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో 26 బెంచులు నిర్వహించారు. ఫిర్యాదుదారులు రాజీకి సమ్మతించడంతో 707 క్రిమినల్ కేసులు, 69 సివిల్ కేసులు, 26 మోటారు వాహన ప్రమాద పరిహార కేసులు, 3,452 ప్రిలిటిగేషన్ కేసులకు పరిష్కారం దక్కాయి. ప్రమాదభరిత కేసులలో కక్షిదారులకు పరిహారం కింద రూ.1,97,80,000 ఇప్పించడమే కాకుండా రాజీ మార్గంలో పరిష్కరించారు. సివిల్ కేసుల్లో రూ.56,63,000, ప్రిలిటిగేషన్ కేసుల్లో రూ.33,32,871 పరిహారం కింద ఇప్పించారు. ఇన్‌చార్జ్ జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు సి.సత్యవాణి, కార్యదర్శి జి.శివప్రసాద్ యాదవ్ పర్యవేక్షించారు.

8న హాస్టళ్లు పునఃప్రారంభం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలల్లో పీజీ తరగతుల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. వాస్తవానికి జూలై 1వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన తరగతులు 8వ తేదీకి వాయిదా పడ్డాయి. దీంతో హాస్టళ్లు సైతం అదే రోజు తెరవాలని నిర్ణయించారు. పీజీ తరగతులు, హాస్టళ్ల నిర్వహణపై శనివారం వర్సిటీలో వార్డెన్ ప్రొఫెసర్ చిట్టా సురేష్ అధ్యక్షతన డిప్యూటీ వార్డెన్ల సమావేశం నిర్వహించారు. యూనివర్సిటీలో నీటి ఎద్దడి నెలకొన్న నేపథ్యంలో హాస్టళ్లు ప్రారంభిస్తే విద్యార్థుల ఆందోళనలు కట్టడి చేయలేమని అధికారులు పేర్కొన్నట్లు తెలిసింది. సమస్యలు పరిష్కరించేంత వరకు వాయిదా వేయడం ఉత్తమమనే అభిప్రాయానికి వచ్చారు. పంగల్ రోడ్డు వద్ద ఎస్కేయూ యాజమాన్యం తవ్వించిన బోరు బావుల నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా క్యాంపస్‌కు నీటి సరఫరా చేస్తున్నారు. అయితే నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణ సమయంలో పైపులైన్ తొలగించిన కాంట్రాక్టర్ కొత్త పైపులైన్ వేయడంలో నిర్లక్ష్యం వహించారు. దీంతో క్యాంపస్‌కు నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ సమస్యను వారంలోపు పరిష్కరించుకోవాలని అధికారులు భావిస్తున్నారు. కాంట్రాక్టరు స్పందించి పైపులైన్‌ను పునరుద్ధరిస్తే విద్యార్థులకు తరగతులు, హాస్టళ్లు అందుబాటులోకి రానున్నాయి. అప్పటి దాకా తరగతుల నిర్వహణ వాయిదా అనివార్యం అని అధికారులు బాహాటంగానే పేర్కొంటున్నారు.

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

- జిల్లాలో 2,70,966 మంది పింఛన్‌దారులు
- రూ.184.70 కోట్లు విడుదల



వీసీలో పాల్గొన్న జేసీ అభిషేక్‌కుమార్, ఇతర అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఏ ఆసరా లేని వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు తదితర వర్గాలకు ఎన్టీఆర్ భరోసా కింద అందించే పింఛన్ పంపిణీ సోమవారం ఉదయం 6 గంటలకే ప్రారంభం కానుంది. లబ్ధిదారులందరికీ ఇంటివద్దే పింఛన్ మొత్తం అందించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని 32 మండలాలు, 6 మున్సిపాలిటీల పరిధిలో 2,70,966 మంది పింఛన్‌దారులుండగా, ప్రభుత్వం రూ.184.70 కోట్లు విడుదల చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. జూలై 1వ తేదీన సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తారన్నారు. పింఛన్ పంపిణీకి మొత్తంగా 4,249 మంది ఉద్యోగులను నియమించామన్నారు. సచివాలయ సిబ్బంది తక్కువగా ఉన్న మండలాలు, మున్సిపాలిటీల్లో ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన 789 మంది ఉద్యోగులను పింఛన్ పంపిణీని నియమించారు.

పింఛన్ పంపిణీ ఇలా..

వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేతన్నలు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, హెచ్ఐవీ బాధితులు, హిజ్రాలకు పింఛన్ మొత్తం రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచారు. ఎన్నికల హామీ మేరకు గత మూడు నెలల అరియర్స్ రూ.3 వేలు కలిపి మొత్తంగా ఒక్కో పింఛన్‌దారునికి రూ.7 వేలు అందించనున్నారు. దివ్యాంగుల పింఛన్ మొత్తాన్ని రూ. 6 వేలకు పెంచారు. వీరికి జూలై 1వ తేదీన రూ.15 వేలు అందించనున్నారు. అలాగే కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి చేసుకున్న వారికిచ్చే పింఛన్ రూ.10 వేలు, మంచానికే పరిమితమైన వారికిచ్చే పింఛన్ రూ.15 వేలకు పెంచారు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

జిల్లా వ్యాప్తంగా 1వ తేదీనే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేశామని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కు తెలిపారు. శనివారం సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. కలెక్టరేట్ నుంచి పాల్గొన్న జేసీ మాట్లాడుతూ, జిల్లాలో పింఛన్ పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. సచివాలయ ఉద్యోగులతో పాటు ఇతర శాఖల సిబ్బందినీ పింఛన్ పంపిణీ కోసం నియమించామన్నారు.

ఆగని టీడీపీ దౌర్జన్యకాండ



వైఎస్సార్ సీపీ నాయకుడి పొలంలో చీనీచెట్లు నరికివేసిన దృశ్యం



పైపులను ధ్వంసం చేసిన దృశ్యం

- మైలసముద్రంలో వైఎస్సార్ సీపీ నేతల ఆస్తుల ధ్వంసం
- చీనీ చెట్లు నరికివేత, బోరు పైపులు ధ్వంసం, స్టార్టర్‌పెట్టెల చోరీ

కొత్తచెరువు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రోజు నుంచీ టీడీపీ నాయకుల దౌర్జన్యాలు ఎక్కువయ్యాయి. వైఎస్సార్ సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని భౌతిక దాడులు, ఆస్తుల ధ్వంసానికి పూనుకుంటున్నారు. తాజాగా కొత్తచెరువు మండలంలోని మైలసముద్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డికి చెందిన 50 చీనీ చెట్లు, కొండారెడ్డికి చెందిన 120 చీనీ చెట్లను శనివారం రాత్రి కొందరు వ్యక్తులు నరికివేశారు. అలాగే డాక్టర్ నరసింహారెడ్డికి చెందిన 3 స్టార్టర్ పెట్టెలను చోరీ చేశారు. నీటి సరఫరా కోసం వేసిన పైపులు, డ్రిప్ పైపులు ధ్వంసం చేశారు. దీంతో గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు భయాందోళన చెందుతున్నారు. రాజకీయ కక్షతోనే తమ పొలాల్లోని చీనీ చెట్లు నరికి, పైపులు ధ్వంసం చేశారని బాధితులు వాపోయారు. కాగా పదిరోజుల క్రితం రాప్తాడు నుంచి గ్రామానికి వచ్చిన 10 మంది వ్యక్తులు వైఎస్సార్ సీపీ నాయకుల ఇళ్లపై దాడులు చేసిన విషయం తెలిసిందే. తాజాగా వైఎస్సార్ సీపీ నేతల ఆస్తులు ధ్వంసం చేయడం, పొలాల్లోని చీనీ చెట్లను నరికివేయడం చూస్తుంటే కొందరు వ్యక్తులు కావాలనే చేసినట్లు ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా ఈఘటనపై బాధిత రైతులు కొత్తచెరువు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టినట్లు సీఐ రాజారమేష్ తెలిపారు.

మత్తు.. యువత చిత్తు!

- జిల్లా వ్యాప్తంగా గంజాయి అమ్మకాల జోరు
- యువకులు, విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు
- భవిష్యత్ అంధకారం చేసుకుంటున్న యువత
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న తల్లిదండ్రులు



- కదిరిలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల క్రితం పదో విద్యార్థి తరగతి ఒకరు గదిలో మత్తుగా తూలుతున్నాడు. అనుమానం వచ్చిన ఉపాధ్యాయుడు సదరు విద్యార్థి జేబులు తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్ బయట పడింది. ఎక్కడి నుంచి వచ్చిందని ఆరా తీస్తే... తానే రూ.500 వెచ్చించి కొనుగోలు చేశానని విద్యార్థి చెప్పడంతో సదరు టీచర్‌తో పాటు తోటి విద్యార్థులు సైతం ఉలిక్కి పడ్డారు.

..జిల్లా వ్యాప్తంగా అనేక పాఠశాలలు, కళాశాల విద్యార్థులు గంజాయికి బానిసయ్యారు. గంజాయి విక్రయదారులు యువతనే టార్గెట్ చేస్తూ వారి జీవితాలను నాశనం చేస్తున్నారు.

కదిరి: విద్యార్థులు..ఉన్నత చదువులు పూర్తి చేసిన యువకులు గంజాయికి అలవాటు పడ్డారు. మత్తులో తూలుతూ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. ఏ పని చేయకుండా నిత్యం మత్తులో ఉంటూ తల్లిదండ్రులను క్షోభకు గురిచేస్తున్నారు. గంజాయి కొనేందుకు సకాలంలో డబ్బు చేతికందక చాలా మంది చోరీలు కూడా చేస్తున్నారు. గంజాయి మత్తులో రాత్రి పూట వేగంగా బైక్‌లను నడుపుతూ పలువురు ప్రమాదాల బారిన పడి మంచానికి పరిమితమయ్యారు. ఇంకొంతమంది డబ్బు ఇవ్వనందుకు ఏకంగా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై దాడులకు సైతం దిగుతున్నారు. ప్రధాన పట్టణాలకే పరిమితమైన గంజాయి మత్తు ఇప్పుడు గ్రామాలకు సైతం పాకింది.

యుక్త వయసులోనే అనారోగ్యం పాలు..

గంజాయి మత్తుకు అలవాటు పడిన ఎంతోమంది యువకులు యుక్త వయసులోనే అనారోగ్యం పాలవుతున్నారు. యువత మొదట సిగరెట్లకు అలవాటు పడి తర్వాత క్రమంగా గంజాయికి బానిసవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి విషయంలో అందరినీ ఆశ్చర్యపరిచే విషయం ఏమిటంటే... గంజాయికి బానిసైన వారితో పాటు గంజాయిని విక్రయించేవారు కూడా యువతే కావడం గమనార్హం. వీరంతా 30 ఏళ్లలోపు వారే.

సిగరెట్లలో నింపి విక్రయాలు

జిల్లాలో కొన్ని చోట్ల గంజాయిని పొడిగా చేసి చిన్న చిన్న పాకెట్లలో విక్రయిస్తుంటే... ఇంకొన్ని చోట్ల సిగరెట్లలో పొగాకు తొలగించి, దాని స్థానంలో గంజాయిని నింపి అమ్ముతున్నారు. ప్రధానంగా కదిరి, ధర్మవరం, హిందూపురం, మడకశిర పట్టణాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, ఉన్నత పాఠశాలలే లక్ష్యంగా గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. 10 గ్రాముల గంజాయి నాలుగు సిగరెట్లలో నింపవచ్చని చెబుతున్నారు. 10 గ్రాముల గంజాయి ప్యాకెట్ రూ.500 నుంచి రూ.600 అమ్ముతున్నట్లు తెలిసింది. గంజాయి నింపిన ఒక్కో సిగరెట్ రూ.150 వరకూ విక్రయిస్తున్నట్లు కొందరు విద్యార్థులు చెబుతున్నారు.

మత్తే వారి ప్రపంచం..

కొందరు విద్యార్థులు గంజాయికి అలవాటు పడి అలాంటి వారితోనే స్నేహం చేస్తున్నారు. మత్తే వారి ప్రపంచంగా మారింది. గంజాయికి బానిసైన వారి శరీర ఆకృతిలో మార్పులు రావడం, ఇంకొందరు మానసిక రోగులుగా మారి కుటుంబ సభ్యులపై గొడవలకు దిగుతున్నారు. మత్తుకు బానిసైన తమ పిల్లలను బాగు చేసుకునేందుకు కొందరు తల్లిదండ్రులు అనంతపురంలోని ఓ మానసిక చికిత్స నిపుణుడి దగ్గరకు తీసుకెళ్లి కౌన్సెలింగ్ కూడా ఇప్పిస్తున్నట్లు కదిరికి చెందిన ఒక వైద్యుడు తెలిపారు.

అరికట్టడం సాధ్యమేనా?

రాష్ట్రంలో గంజాయి విక్రయాలపై ఉక్కు పాదం మోపుతామని హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజే మంత్రి వంగలపూడి అనిత మీడియా ముందు చెప్పారు. కానీ ఇది సాధ్యమేనా? అని జిల్లా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎందుకంటే దీని వెనుక కొందరు అధికార తెలుగుదేశం పార్టీ నాయకులే ఉంటే గంజాయి అమ్మకాలు ఎలా ఆగుతాయని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొందరు పోలీసులు సైతం గంజాయి మత్తులో జోగుతూ దీన్ని 'మామూలు'గా స్వీకరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

నియంత్రణకు చర్యలు



గంజాయి సరఫరాతో పాటు క్రయ, విక్రయాలపై చర్యలు తీసుకుంటాం. వీటిపై ప్రత్యేక నిఘా ఉంచాం. గంజాయి విక్రయించినా, సేవించినా నేరమే. వీరిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. యువత గంజాయికి బానిసై బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలి. ఎలాంటి వారితో తిరుగుతున్నారనే దానిపై దృష్టి సారించాలి. ఎక్కడైనా గంజాయి అమ్మకాలు జరుగుతుంటే వెంటనే డయల్ 100కు గానీ, లేదంటే స్థానిక పోలీసు అధికారులకు గానీ ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వండి.

– ఎస్.వి.మాధవరెడ్డి, ఎస్పీ



క్లుప్తంగా

మందుల దుకాణాల్లో తనిఖీలు



మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి

బత్తలపల్లి: మండల కేంద్రంలో మందుల (మెడికల్ స్టోర్స్) దుకాణాల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి శనివారం తనిఖీలు నిర్వహించారు. మందులు నాణ్యమైనవేనా, నాసిరకం మందులు విక్రయిస్తున్నారా తదితర అంశాలను పరిశీలించినట్లు తెలిసింది. అయితే ఆయన మీడియాతో మాట్లాడేందుకు ఇష్టపడలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతుడు పవన్

కనగానపల్లి: కొండపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కంబదూరు మండలం తిప్పేపల్లికి చెందిన పవన్‌కుమార్(30) శుక్రవారం రాత్రి వారి స్వగ్రామం నుంచి అనంతపురానికి బైక్‌పై బయలుదేరాడు. కొండపల్లి సమీపంలోని ఓ మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పటంతో అతను రహదారి పక్కన గుంతల్లోకి పడి తీవ్రంగా గాయపడ్డాడు. రాత్రి వేళల్లో ఈ విషయాన్ని ఎవ్వరూ గమనించకపోవటంతో అక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం ఆ రహదారి వెంట వెళ్తున్న వాహనదారులు గుర్తించి వెంటనే పోలీసులకు, మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు బోరు వాహనం డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఇతనికి భార్య వాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుత్తి వాసి దుర్మరణం

ప్యాపిలి: వెంగళాంపల్లి- వెంకటాంపల్లి మార్గంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా గుత్తి వాసి దుర్మరణం చెందాడు. గుత్తికి చెందిన ధనుంజయ (30), పామిడికి చెందిన శివయ్య బైక్‌పై బేతంచెర్ల మండలం మద్దిలేటి స్వామి దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి వెళ్తుండగా వెంగళాంపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ధనుంజయ అక్కడికక్కడే మృతి చెందాడు. శివయ్యకు కాలు విరగడంతో డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు ధనుంజయకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవిశ్రాంతమా!

- ఈసారి ఒకరోజు ముందుగానే సేవలకు సెలవు
- నేడు ప్రభుత్వ ఉద్యోగుల విరమణ దినోత్సవం



అనంతపురం కల్చరల్: ఉద్యోగం చాలామందికి జీవనాధారం..మరికొందరికి ప్రజాసేవకు అందివచ్చిన అవకాశం. ఏదేమైనా తమ సర్వీసులో ప్రభుత్వం తమకు అప్పజెప్పిన బాధ్యతలను భుజస్కందాలపై మోసి కాలం తీరగానే రిటైర్ అవుతుండడం చాలామందికి హాయినిచ్చే అంశమే. విశ్రాంతి పొందడం ద్వారా కుటుంబంలో నిర్వర్తించాల్సిన పనులను వేగవంతం చేయడానికి అనువైన సమయం. ఈ నేపథ్యంలోనే ఏటా జూన్ 30న 'ఉద్యోగ విరమణ దినోత్సవం'గా జరుపుకుంటున్నాం. ఈసారి నెలాఖరు సెలవుదినం కావడంతో ఒకరోజు ముందుగా అంటే శనివారమే నగరంలో అనేకమంది రిటైర్ అయి పాత బాధ్యతలను వదిలి కొత్త బాధ్యతలను చేపట్టనున్నారు. ఒకసారి గతాన్ని తలుచుకుంటే కొన్ని ఆవేదనలు, అసంతృప్తులు ఉన్నట్టే మరచిపోలేని తీయని జ్ఞాపకాలూ.. అందంగా పలకరిస్తాయి. తమ అపార అనుభవం కుటుంబ సభ్యుల కోసమే కాదు సమాజహితం కోసమని..భవిష్యత్తులో సమాజసేవకు తమ వంతు సాయమందించాలని తెలియజేసేందుకే ఈ రోజున ఉద్యోగ విరమణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

వ్యాపకమంటూ ఉంటేనే ప్రశాంతత..

ఉద్యోగం చేసినన్నాళ్లు క్షణం తీరిక లేకుండా ఎంతో బిజీగా గడిపిన తాము ఉద్యోగ విరమణ తర్వాత ఏం చేయాలన్నది పాత తరం వారికి శేష ప్రశ్నగా మిగిలిపోయేది. ఇప్పటి వారు ముందుగానే తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుంటున్నారు. అయ్యో.. మొన్న చేరినట్టుంది అప్పుడే ఉద్యోగ జీవితం అయిపోయిందా..అనుకునే వారి సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది.. కారణం రాజకీయ ఒత్తిడులతో దినదిన గండంగా మారుతున్న ఉద్యోగాల కంటే తొందరగా రిటైర్ అయి స్వేచ్ఛాయుత జీవితం గడపాలనుకున్నవారు అధికంగా ఉన్నారన్నది ఎక్కువగా వ్యక్తమవుతున్న అభిప్రాయం. ఉద్యోగ విరమణ ఒంటరితనం అనారోగ్యం బారిన పడనీకుండా వ్యాపకమంటూ ఒకటుండాలని అనుభవజ్ఞులంటుంటే జాతి నిర్మాణంలో తమ వంతు పాత్ర నిర్వహించి సంతృప్తిని మిగుల్చుకుని హాయిగా శేషజీవితాన్ని ఆస్వాదిస్తామని మరికొందరంటున్నారు.

ఆరోగ్యకరమైన బిజీ పెట్టుకోవాలి



మాది చెన్నేకొత్తపల్లి మండలం సమీపంలోని ముష్టికోవెల గ్రామం. ఉపాధ్యాయునిగా పలుచోట్ల పనిచేసి దాదాపు మూడు దశాబ్దాల కిందట ఉద్యోగ విరమణ చేశాను. ఆర్థిక ఒత్తిళ్లు, ఒంటరితనం భయపెట్టకుండా కాస్తంత ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తూ కుటుంబ సభ్యుల ఇష్టాలను గౌరవించినపుడు ఎటువంటి సమస్య ఉత్పన్నమవదు. ఆరోగ్యకరమైన బిజీగా ఉండడం వల్లే జీవితం సమయమంటూ తెలీకుండానే గడచిపోతుంది.

– కరణం ఆదిశేషప్ప, విశ్రాంత ఉపాధ్యాయుడు

క్రీడాకారులకు చేయూతనందిస్తా



పోలీసు శాఖలో 40 ఏళ్లు పలుచోట్ల పని చేశా. నేను స్వతహాగా క్రీడాకారున్ని కావడంతో అనేక సార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఆ అనుభవంతోనే ఎంతో మందికి బాస్కెట్‌బాల్, వాలీబాల్ వంటి వాటిల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నా. ఉద్యోగ విరమణ తర్వాత మరింతగా సేవలందించాలనుంది. పోలీసుగా ఉన్నప్పటికీ ఆధ్యాత్మికంగా ఉన్నందున ఎంతో మంది కష్టాల్లో ఉన్నవారికి సాయమందించే అవకాశం నాకీ ఉద్యోగం వల్ల వచ్చింది. పిల్లలిద్దరికి పెళ్లి చేయాలి. కానీ నా మొదటి ప్రాధాన్యం సేవారంగమే.

– బాలరామారావు, ఎస్‌ఐ

అనేక ఒడిదుడుకులు చూశా



నా 38 ఏళ్ల సర్వీసులో అనేక ఒడిదుడుకులు చూశా. ఎన్నో ఒత్తిళ్లు భరించాను. అయితే నా పరిధిలో చాలా మందికి ఉపయోగపడినాననే అనుకుంటున్నా. గతేడాది ఉత్తమ ఉద్యోగిగా జిల్లా అధికారుల చేతుల మీదుగా ప్రశంసలందుకోవడం ఆనందంగా ఉంది. నాకు ముగ్గురు ఆడపిల్లలు. అందరికీ పెళ్లి చేసేశాను. ఇక శేష జీవితం ఆనందంగా గడపడానికి కుటుంబానికి ఎక్కువ సమయమిస్తూనే సమాజానికి నా వంతు సేవ చేయాలనుకుంటున్నాను.

– వేణుగోపాల్, వైద్యారోగ్య శాఖ

సంతృప్తికరంగా విధులు



నేను 2007లో నగరపాలక సంస్థలో కారుణ్య నియామకం కింద ఉద్యోగంలో చేరాను. 18 ఏళ్ల సర్వీసు మొత్తం ఎంతో సంతృప్తికరంగా సాగిపోయింది. నగరపాలక సంస్థలో రెవెన్యూ విభాగం అంటే పబ్లిక్ రిలేటెడ్ పోస్టు కాబట్టి అందరినీ సమన్వయం చేసుకుంటూ అంకితభావంతో పనిచేశాను. అధికారులు కూడా ఎంతో గౌరవంగా చూశారు. నాకు ఒకే కొడుకు అతనికి పెళ్లయిపోయింది. ఇక విశ్రాంత జీవితం ప్లాన్ చేసుకోవాలి.

– పద్మలత, నగరపాలక సంస్థ



ఖాద్రీశుడి దర్శనం కోసం క్యూలో భక్తులు

మార్మోగిన నారసింహ నామస్మరణ

కదిరి టౌన్: ఓం నమో నారసింహ నామస్మరణతో ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం మార్మోగింది. శనివారం కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో శ్రీదేవి భూదేవి సమేత వసంతవల్లభుని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేయడంతోపాటు అన్నదానం నిర్వహించారు. నరసింహస్వామి కాపులు మొక్కుబడిగా తలనీలాలు సమర్పించారు. మహిళలు ఆలయం ముందు దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

EDUCATION

శేఖర్ కోచింగ్ సెంటర్

- 10th/ఇంటర్ ఫెయిల్ ట్యూషన్స్ శేఖర్ కోచింగ్ సెంటర్ C/o. P.R.K. జూనియర్ కాలేజ్, 3వ రోడ్డు, Opp: G.R. ఫంక్షన్ హాల్, ATP. హాస్టల్ కలదు. Open 10th, Inter, Degree కలదు. [A-180]

B.TECH ADMISSIONS

- AP EAPCET క్వాలిఫై కాని వారికి, ఎంట్రెన్స్ రాయని స్టూడెంట్స్‌కి B.Tech నందు ఫ్రీ ఎడ్యుకేషన్ కలదు. హాస్టల్ ఫీజు మాత్రమే కట్టుకోవలెను. కాలేజీ ఫీజు ఉండదు. Contact : G. MURALI, 9030661651, అనంతపురం. [A-1263]

DMLT ADMISSIONS

- DMLT 2 సం॥ల కోర్సునకు అడ్మిషన్లు జరుగుచున్నవి. Q: ఇంటర్ పాస్ (ఏ గ్రూప్ అయిన) అర్హులైన వారికి స్కాలర్ షిప్ కలదు. మా కాలేజ్ నందు స్టేట్ ర్యాంకులు 1st & 6th to 14th వరకు. # SEEDS కాలేజ్ కమలానగర్, ATP. 9440255034. [A-1269]

DSC COACHING

- DSC Coaching for S.A Content only. Maths, Physical Science only content (Both EM & TM) Physics, Chemistry, Biology-up to Intermediate level 20 Yrs of experience faculty from corporate sector. # 2nd Road circle near, N- MAX Theatre, ATP. Cell: 9618562274. [A-7014]

NURSING ADMISSIONS

- AP EAPCETలో క్వాలిఫైడ్ స్టూడెంట్స్‌కి, B.Sc.(Nursing) నందు ఫ్రీ ఎడ్యుకేషన్ +కాలేజీలో హాస్టల్ కలదు. క్వాలిఫై కానివారికి AP EAPCET రాయని స్టూడెంట్స్‌కి GNM (నర్సింగ్), B.Sc (MLT), BTP (ఫిజియోథెరపీ), నందు ఫ్రీ ఎడ్యుకేషన్ కలదు. సంప్ర: జి. మురళి 9030661651, అనంతపురం. [A-1264]

EDUCATION

- B.Sc, P.B.B.Sc, GNM, DMLT, DOA, DRGA, DIALYSIS, DMST అడ్మిషన్లు జరుగుతున్నవి. సీట్లు పరిమితం, స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. వివరాలకై సంప్రదించండి Aayushman Group Of Institutions. సెల్: 98495 65780. [L-800672]

ADMISSIONS

- 10వ తరగతి/ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు Nursing, MLT, CSE+ MPC గ్రూపులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. హాస్టల్ వసతి కలదు. 82474 57565. [T-2133]

REAL ESTATE

ప్లాటు అమ్మబడును

- అనంతపురం, కళ్యాణదుర్గం రోడ్డు, ద్వారకా విల్లాస్ వెనుక S.No. 144, రాచానపల్లి పొలం ఇల్లు కట్టుకొను 58x30 కొలతలు గల 4సెంట్ల స్థలం అమ్మబడును. నో బ్రోకర్స్. 6281267589 [A-911]

PLOTS FOR SALE

- శ్రీ లక్ష్మినగర్, రాప్తాడు NH-44 హైవే రోడ్డు, ఆనుకొని, పంచాయతి అప్రూవ్డ్, ఓపెన్ ప్లాట్స్ కలవు. సెల్ నెంబర్ : 8074924603. [A-1262]

RENT / LEASE

- 12000 sq.ft 4 floors building 3000 sq.ft vacant Land available for Rent/Lease in center of ATP City. Suitable for Schools & Offices. Cell: 9849781005. [A-3257]

RENT FOR HOSTEL

- 2500 sq. Yard బిల్డింగ్ హాస్టల్ వసతి కలదు, టౌనుకు సెంటర్ నందు సూర్య నగర్ రోడ్, అపోలో డెంటల్ క్లినిక్ పైభాగమున కలదు. సెల్ : 94419 84219 [A-3256]

REAL ESTATE

- MSR Developers కొరకు తెలంగాణ/ఆంధ్రా ల్లో మార్కెటింగ్ సిబ్బంది కావలెను & మీరు ఉన్న ఏరియాల్లోనే లేఅవుట్ వెంచర్ ఫాం ల్యాండ్ పార్ట్‌నర్స్ కావలెను.ఫోన్: 8499940666 [H-189681]

HOUSE FOR SALE

- అనంతపురం జిల్లా, పెద్దవడుగూరు మండలంలోని కోటలో 100% వాస్తుతో నిర్మించిన, ఉత్తరం, దక్షిణం కార్నర్ ఇల్లు 2 సెంట్లలో నిర్మించినది అమ్మబడును. ఫోన్: 90529 59380. [L-800678]

HOUSE FOR SALE

- కర్నూలు జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజికి సమీపంలో G+4 అంతస్తులు గల కమర్షియల్ భవనము అమ్మకమునకు కలదు. ఈ భవనమునకు ప్రతి నెలకు రూ॥1,70,000/- అద్దె కూడ వచ్చును. ఆసక్తి గల వారు సం.ప్ర: 9949966477, 6300165692. [L-796470]

WANTED

- టీచర్లు కావలెను. 1st to 10th Class వరకు అన్ని సబ్జెక్టులకు టీచర్స్ కావలెను. సంప్రదించండి. సెల్ : 94933 55962. [A-1265]
- కాలేజ్ అడ్మిషన్స్ చేయుటకు టెలికాలర్స్ కావలెను. అడ్రస్ : అనంతపురం టౌన్, నియర్ టవర్ క్లాక్. సెల్ : 8106624933. [A-1267]
- ATP, ఓల్డ్ టౌన్, వాటర్ బాటిల్స్ డెలివరీ Boys కావలెను. 3వీలర్ డ్రైవింగ్ వచ్చిన వారు, జీతం: 12-20K + ఫుడ్ & అకామడేషన్. 9985960006. [A-1258]
- ప్రముఖ రియల్ ఎస్టేట్ నందు పనిచేయుటకు అసిస్టెంట్ మేనేజర్ కావలెను ఫిక్స్ శాలరీ + ఇన్సెంటివ్స్ కలదు. సంప్రదించండి : 6300725354. [A-178]
- అనంతపురం జిల్లాలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, ఎక్స్ ఆర్మీ, ANM, GNM నర్సులు కావలెను. సంప్ర: R.R.Naik Agency, Cell:9059959559, 9030469503. [L-796454]
- Sanjay Ghodawat యూనివర్సిటీకి B.Tech / Admisions చేయుటకు Lady Tele Counselleros కావలెను. Qlf: Any Degree. Contact: 99598 99798, 96400 60006. [NA-23557]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1185254]
- విజయవాడలో NRI ల / సంపన్నుల ఇళ్ళ వద్దే వుండి పెద్దవారిని / బెడ్ పేషంట్లని చూసుకొనుటకు కేర్‌టేకర్స్ M/F ఆయాలు, నర్సులు కావలెను. వ+భో+జీతం Cell: 91608 35559, 98850 25559. [B-133]
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217. [M-1185232]
- ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, వంట/ఇంటిపనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజ నం. జీతం:20K. ఫోన్. 8977639662 / 8977639663. [HA-298]
- పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-800412]
- గార్మెంట్స్ షాపు (ATP) నందు పనిచేయుటకు బాయ్స్ & గర్ల్స్ కావలెను. అనంతపురం నివాసులు మాత్రమే సెల్ : 9989956694. [A-3253]
- అనంతపురం జిల్లా గార్లదిన్నెలో ఉన్న ఎడ్యుకేషనల్ సర్వీస్ ఆఫీసులో టెలికాలర్స్‌గా వర్క్ చేయడానికి ఫిమేల్స్ కావలెను. సెల్: 8977502169. [A-3236]
- ఆయుర్వేద హాస్పిటల్ నందు పనిచేయుటకు Experienced అబ్బాయి కావలెను. అనంతపురం. సెల్ : 8977795530 [A-7015]
- పామిడి, శ్రీ చైతన్య ఇం. మీ. హైస్కూల్ నందు 1 to 10th హిందీ, ఇంగ్లీషు, మ్యాథ్స్ సబ్జెక్టులకు టీచర్స్ కావలెను.9573736655,8790612613. [A-179]
- మా కంపెనీలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ పురుషులు కావలెను. Qualification: కంప్యూటర్ నాలెడ్జ్, EXP. కలిగి, 40 సం॥లోపు ఏజ్ కలవారు మాత్రమే. జీతం: 8-9 వేలు. # కమలానగర్, ATP. 9493181828. [A-1266]
- దండపాని రియల్‌ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఫిక్స్ శాలరీ 10,000 నో టార్గెట్ అనుభవం కలవారికి ప్రాధాన్యత ప్లాట్ నెంబర్ 204, లోటస్ గ్రాండ్, రాంనగర్ అనంతపురం.Contact: 6300725354. [A-176]
- WANTED TEACHER'S: MATHS, ENGLISH,HINDI for 6th to 10th EM. Un-Trained (UG/PG) also preferable but 2 years teaching experience must. For Staying teachers providing Food & Accommodation. For Daily Travelling 30KM (TA). Contact: VIGNAN EM HIGH SCHOOL, Somandepalli, Near Penukonda, Sri Sathya Sai (Dist) A.P. Cell: 8309913221, 9347986668. [A-1268]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు

- విద్యుత్ శాఖ విజిలెన్సు ఎస్‌ఈ శ్రీనివాసబాబు



తనకల్లులో పరిశ్రమను తనిఖీ చేస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్: సర్వీస్ కనెక్షన్ లేకుండా విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ విజిలెన్స్ ఎస్‌ఈ శ్రీనివాసబాబు హెచ్చరించారు. శనివారం ఉమ్మడి జిల్లాలోని కదిరి, అనంతపురం డివిజన్లలో విజిలెన్స్ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ పొంది.. దాంతో పరిశ్రమలకు నీటిని వినియోగిస్తున్న నిర్వాహకునిపై కేసు నమోదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ లేకుండా ఐదు కంటే ఎక్కువ విద్యుత్ సర్వీసులు తీసుకున్నట్లు విచారణలో బయట పడడంతో మరో 4 కేసులు పెట్టారు. అనంతరం ఎస్‌ఈ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులతో ఎస్‌ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసబాబు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై గట్టి నిఘా ఉంచాలన్నారు. కొత్తగా మంజూరు చేస్తున్న విద్యుత్ కనెక్షన్లపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నట్లు విచారణలో బయటపడితే మంజూరు చేసిన అధికారితోపాటు కనెక్షన్ పొందిన వినియోగదారులపై సైతం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. 5 విద్యుత్ సర్వీసులు దాటితే కచ్చితంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను వినియోగదారుడు ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. ఇష్టారాజ్యంగా విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడంతో గృహ విద్యుత్ వినియోగదారులు లో ఓల్టేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా విజిలెన్స్ అధికారులు గోపీ, రామాంజినేయులు, నాగేంద్ర, అల్లీపీరా పాల్గొన్నారు.

ఆర్‌బీకేలు ఇక రైతు సేవా కేంద్రాలు

అనంతపురం అగ్రికల్చర్: గత ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేసిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు ఇక నుంచి రైతు సేవా కేంద్రాలుగా పనిచేయనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఆర్‌బీకే ఛానల్‌ను పాడిపంటలు ఛానల్ గా, అదే విధంగా ఆర్‌బీకే మ్యాగజైన్లను కూడా పాడిపంటలు మ్యాగ్‌జైన్లుగా పేర్లు మార్పు చేశారన్నారు. వ్యవసాయ సలహా మండలిని రద్దు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయన్నారు.

అగ్ని ప్రమాదంలో అరటి తోట దగ్ధం

- రూ.8 లక్షలు నష్టం



దగ్ధమైన అరటితోటను పరిశీలిస్తున్న పోలీసులు

తాడిమర్రి: తురకవారిపల్లిలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో అరటితోట దగ్ధమైంది. బాధిత రైతులు తెలిపిన వివరాలు..వైఎస్సార్ జిల్లా లింగాల మండలం పార్నపల్లికి చెందిన అన్నదమ్ములు మొరుసు శ్రీనివాసులు, మొరుసు వెంకటరమణ, మొరుసు కృష్ణంనాయుడు తురకవారిపల్లి సమీపంలో తమకున్న ఐదెకరాల్లో ఏడాదిన్నర క్రితం అరటి పంట సాగు చేశారు. ప్రస్తుతం రెండో పంట కాపునకు రావడంతో 40 శాతం పంట కోయగా మిగతా పంట కోయాల్సి ఉంది. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో తోటలో మంటలు చెలరేగాయి. దాడితోట గ్రామస్తులు దీనిపై రైతులకు సమాచారం ఇచ్చారు. రాత్రి 10 గంటల సమయంలో రైతులు తోటవద్దకు వెళ్లి తీవ్రంగా శ్రమించి మంటలను ఆర్పారు. అప్పటికే అరటి పంటతో పాటు డ్రిప్పు, పైపులు కాలిపోయాయి. సుమారు రూ.8 లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం అందుకున్న హెడ్‌కానిస్టేబుళ్లు గణేష్, నాగరాజు తోటవద్దకు వెళ్లి అగ్ని ప్రమాదంపై వివరాలు సేకరించారు. గుర్తు తెలియని దుండగులు ఉద్దేశపూర్వకంగానే తమ తోటకు నిప్పు పెట్టారని బాధిత రైతులు వాపోయారు. పంట నష్టంపై అంచనా వేసినట్లు హెచ్‌ఏ రామాంజనేయులు తెలిపారు.

దివ్యాంగురాలిపై అత్యాచార యత్నం

పావగడ: అప్పాజిహళ్లిలో దివ్యాంగురాలిపై ఓ వ్యక్తి అత్యాచారానికి యత్నించాడు. పోలీసుల వివరాల మేరకు..గ్రామానికి చెందిన వివాహిత పుట్టుమూగ. శుక్రవారం రాత్రి ఆమె భర్త నరేంద్ర గురు ప్రసాద్ తన గొర్రెల కాపలాగా దొడ్డిలో నిద్రించడానికి వెళ్లాడు. అదను కోసం వేచి ఉన్న మనోహర్‌రెడ్డి అనే వ్యక్తి రాత్రి సుమారు 11.30 గంటల ప్రాంతంలో అనిత ఇంటి తలుపుతట్టాడు. శబ్దాన్ని గ్రహించిన ఆమె తలుపు తీసింది. ఆ వెంటనే లోపలికి దూరిన నిందితుడు ఒక్కసారిగా ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. నిద్రలేచిన ఆమె ఐదేళ్ల కుమారుడు గట్టిగా అరిచాడు. దీంతో నిందితుడు అక్కడి నుంచి పరుగులు తీశాడు. కుమారుడి ఏడుపు విన్న తండ్రి నరేంద్ర ఇంటి వద్దకు చేరుకున్నాడు. ఈ సంఘటనపై శనివారం ఉదయం తిరుమణి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనపై జరిగిన ఆఘాయిత్యాన్ని బాధితురాలు సైగల ద్వారా వివరించడంతో పోలీసులు చలించిపోయారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

అలరించిన సంగీత కచేరీ



సంగీత కచేరీ నిర్వహిస్తున్న బాపట్ల సత్యసాయి భక్తులు

ప్రశాంతి నిలయం: సత్యసాయిని కీర్తిస్తూ నిర్వహించిన సంగీత కచేరీ అలరించింది. పర్తియాత్రలో భాగంగా ప్రశాంతి నిలయానికి విచ్చేసిన బాపట్ల సత్యసాయి భక్తులు సత్యసాయి సంగీత సుధా మాధురి పేరుతో సంగీత కచేరీ నిర్వహించారు. చక్కటి భక్తిగీతాలతో సాయి కుల్వంత్ సభా మందిరం మార్మోగింది. తర్వాత భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

పీఆర్ ఎస్‌ఈ ఎవరు?

- నేడు ఎస్‌ఈ ఈరాస్వామి ఉద్యోగ విరమణ
- ఇంకా కొలిక్కిరాని ప్యానల్
- ఎస్‌ఈ నియామకంపై సందిగ్ధం



అనంతపురంలోని పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం

అనంతపురం సిటీ: జిల్లా పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్‌ఈ)గా ఎవరొస్తారనే విషయం అంతుబట్టడం లేదు. ఇప్పుడున్న ఎస్‌ఈ ఎం.ఈరాస్వామి ఆదివారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఎస్‌ఈ ఎవరొస్తారో తెలియడం లేదు. ప్రస్తుతం జిల్లాలో పని చేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల(ఈఈలు)కే ఏమైనా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తారా లేక రెగ్యులర్ ఎస్‌ఈని నియమిస్తారా అనేది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

ప్రాజెక్ట్ ఈఈ కేవీకేవీ ప్రసాద్‌కేనా?

ప్రస్తుత ఎస్‌ఈ ఈరాస్వామి ఆదివారం ఉద్యోగ విరమణ చేయనుండడంతో శుక్రవారంలోగానే(రెండ్రోజులు ముందు) రెగ్యులర్ లేదా ఇన్‌చార్జ్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ కావాల్సి ఉంది. అయితే ఈసారి అటువంటి పరిస్థితి కనబడలేదు. శనివారం నాటికి కూడా ఎస్‌ఈ ఎవరనే అంశానికి సంబంధించి ఉత్తర్వులు అందలేదు. అయితే ప్రాజెక్ట్ ఈఈ కేవీకేవీ ప్రసాద్ జిల్లాలోనే సీనియర్. ఆయన కూడా మరో నాలుగు నెలల్లో రిటైర్డ్ కానున్నారు. ఆయనకే ఎస్‌ఈ బాధ్యతలు కూడా అదనంగా ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మరోవైపు క్వాలిటీ విభాగం ఈఈ కూడా తన వంతు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు శాఖలో చర్చ నడుస్తోంది.

ఇంకా కొలిక్కిరాని ప్యానల్..

రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం ఒక్క రోజే ఆరేడు జిల్లాలకు చెందిన పీఆర్ ఎస్‌ఈలు ఉద్యోగ విరమణ చేయనున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులే కావడంతో ఇంకా ఐఏఎస్‌ల బదిలీలే కొలిక్కిరాలేదు. పై స్థాయిలో ఐఏఎస్‌ల సర్దుబాటు పూర్తయ్యాకే పాలన పూర్తిస్థాయిలో గాడిలో పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పీఆర్ ఈఎన్‌సీ.. పదోన్నతుల జాబితా(ప్యానల్ లిస్ట్) సిద్ధం చేసుకున్నట్లు ఆ శాఖలో చర్చ జరుగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి కనీసం రెండు నెలలు పడుతుందంటున్నారు. అప్పటి వరకు ఆయా జిల్లాల్లో సీనియర్ ఈఈలకు ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయని చర్చ నడుస్తోంది.

కోట్లాది రూపాయల పనులపై ప్రభావం..

రెగ్యులర్ ఎస్‌ఈని జాప్యం లేకుండా నియమించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. దీంతో వాటిపై ప్రభావం పడే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు.

స్టాక్ మార్కెట్ లాభాల ఆశ చూపి మోసం

- రూ.48.60 లక్షల కాజేసిన దుండగుడు

హిందూపురం అర్బన్: స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించిన దుండగుడు.. ఓ వ్యక్తి నుంచి రూ.48.60 లక్షలు కాజేశాడు. దీంతో బాధితుడు హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు...చంద్రకాంత్ వడయార్ అనే వ్యక్తి తన మొబైల్ నుంచి వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేశాడు. సదరు గ్రూప్‌లో హిందూపురం మండలం పూలకుంట పంచాయతీ మహలక్ష్మీ లేఅవుట్‌లో ఉంటున్న సుధాకర్‌ను యాడ్ చేశాడు. అనంతరం సుధాకర్‌తో చాటింగ్ చేసి పరిచయం పెంచుకొన్నాడు. తనకు స్టాక్ మార్కెట్‌పై సంపూర్ణ అవగాహన ఉందని, తాను చెప్పినట్లు షేర్లు కొంటే లాభాలు చూపుతానని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన సుధాకర్ ఈ ఏడాది మే 23వ తేదీన రూ.48.60 లక్షలు చంద్రకాంత్ వడయార్ ఖాతాకు బదిలీ చేశాడు. ఆ తర్వాత షేర్ల గురించి ఆరా తీయగా, చంద్రకాంత్ వడయార్ స్పందించలేదు. అతని ఫోన్ కూడా పనిచేయ లేదు. దీంతో సుధాకర్ హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేయగా, పోలీసులు చంద్రకాంత్ వడయార్‌పై కేసు నమోదు చేశారు.

సెమీ ఫైనల్‌కు నాలుగు జట్లు



హాకీ క్రీడాకారులతో నిర్వాహకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హాకీ పోటీల్లో శనివారం 4 జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. శ్రీసత్యసాయి, విశాఖపట్నం, ఎన్టీఆర్, తిరుపతి జిల్లాల జట్లు సెమీఫైనల్‌కు చేరాయి. ఆదివారం ఉదయం సెమీఫైనల్, సాయంత్రం ఫైనల్ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ హాకీ కార్యదర్శి సూర్యప్రకాష్, హాకీ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి అరవింద్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌరీప్రసాద్, మారుతి, అమ్ముద్దీన్, కిరణ్, కోచ్ హుసేన్ తెలిపారు.